సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం, 9, ఆగస్టు, 2023



అందుబాటులోకి మనోవిజ్ఞాన సేవలు

వైవీయూ ఆధ్వర్యంలో జిల్లా ప్రజలకు సైకలాజికల్ క్లినిక్ సెంటర్ ద్వారా సేవలందించనున్నట్లు వీసీ చింతా సుధాకర్ తెలిపారు. -8లో



ప్రాణం తీసిన ఈత సరదా

ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద నీటిలో మునిగి కడప నెహ్రూ నగర్‌కు చెందిన నల్లబల్లె గణేష్ (17) మృతి చెందాడు. -8లో

గరిష్టం/కనిష్టం
35.9/27.8

వాతావరణం

జిల్లాలో మంగళవారం 27.8 – 35.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. – కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి నుంచి 'మేరా మిట్టి-మేరా దేశ్'

కడప సెవెన్‌రోడ్స్: ఆజాదీ కా అమృత్‌మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు 'మేరా మిట్టి–మేరా దేశ్' జిల్లాలో నిర్వహించాలని కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నా భూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. గ్రామ పంచాయతీలు, అన్ని మండల ప్రధాన కార్యాలయాలు, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించాలన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకోవాలన్నారు. వీరులను గుర్తు చేసుకుంటూ గ్రామ పంచాయతీలలో శిలాఫలకాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీలో 75 మొక్కలు నాటాలని చెప్పారు. ఈ పనులను ఉపాధి హామి నిధులతో చేపట్టాలన్నారు. ప్రతిచోట జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించాలని చెప్పారు. ప్రతి మండలం నుంచి యువత మట్టి కలశాలు తీసుకుని ఒకచోట కలిసి కర్తవ్య పథ్ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారి ముకుందరెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం రు.1,50,232లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. పులివెందులకు చెందిన కాంట్రాక్టర్ ఓటికుంట గంగాధర్ నాయుడు, చంద్రకళలు తమ కుమార్తె నందిని జన్మదినం సందర్భంగా విరాళం అందజేశారన్నారు. కొండాపురం మండలంల పొట్టిపాడు గ్రామానికి చెందిన వీరాపురం ప్రతాపరెడ్డి ఆయన సతీమణి లక్ష్మీలు రూ. 50,116 ఇచ్చారన్నారు. చెప్పారు. దాతలకు స్వామి వారి చిత్ర పటం అందజేసినట్లు చెప్పారు.

ప్రైవేటు పాఠశాలల నుంచి నామినేషన్లు రావాలి



మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి ప్రైవేటు పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ మనాక్‌కు నామినేషన్లు రావాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి అధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ,కడప డివిజన్ డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం వైపు అడుగులు పడేలా సైన్స్‌ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి 5 నామినేషన్లు రావాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి నామినేషన్ల ఎలా చేయాలనే విషయాన్ని తెలియచేశారు. నామినేషన్ల సందర్భంలో సందేహాల నివృత్తికి 9441035830 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సాగుకు ప్రోత్సాహం...
రైతుకు సహకారం



- ఎస్సీ రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సాహం
- ఉచితంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విత్తనకిట్లు
- జిల్లాలో 828 మంది ఎంపిక



కలెక్టరేట్‌లో విత్తన కిట్లను అందజేస్తున్న ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలం సురేష్, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, రాష్ట్ర ఉద్యానసలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి(ఫైల్)



సాగు కోసం విత్తనాలను చల్లుతున్న మహిళా రైతు

కడప అగ్రికల్చర్: వ్యవసాయ సాగు పంటల్లో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం మితిమీరడంతో మనం తినే ఆహారం విషతుల్యమవుతూ అనేక వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో పంటల సాగులో పురుగుమందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మళ్లించేందుకు శాస్త్రవేత్తలు తగిన సూచనలు, సలహాలతో ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వందశాతం రాయితీతో విత్తనాలను అందిస్తున్నారు. ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టారు.

జిల్లాలో 828 మంది రైతుల ఎంపిక...

సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు ఆసక్తి ఉన్న ఎస్సీ రైతులను జిల్లాలో 828 మందిని అధికారులు గుర్తించారు. ఎంపిక చేసిన ఒక్కో రైతుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. 10 వేలు విలువ చేసే వివిధ రకాల పంటలు, కూరగాయల విత్తనాలు పరికరాలతో కూడిన కిట్లను అందిస్తున్నారు. జిల్లాలో గుర్తించిన 828 మంది రైతుల ద్వారా 1039.15 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సేంద్రియ పద్ధతులతో వేరుశనగ, పత్తి, కంది, కూరగాయల పండించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించి కిట్లను ఇటీవలే కడప కలెక్టరేట్‌లో కొందమందికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలం సురేష్, రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజుల చేతుల మీదుగా కొన్ని కిట్లను అందచేశారు.

వ్యవసాయ కిట్లలో ఎముంటాయంటే...

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వందశాతం రాయితీపై అందించే కిట్లలో వేరుశనగ, రాగులు, కందులు, పెసలు, సజ్జలు, కొర్రలు, జొన్న, మొక్కజొన్న, శనగ విత్తనాలు ఉంటాయి. వీటితోపాట కిచెన్ గార్డెన్‌కు సంబంధించిన కూరగాయల కిట్లు రెండు, రెండు వంద లీటర్ల డ్రమ్ములు, 200 లీటర్ల డ్రమ్ము ఒకటి, టార్పాలిన్ పట్ట, 30 పసుపు జిగట అట్టలు.. 8 చొప్పున లింగాకర్ష బుట్టలు అందచేస్తారు.

అవగాహన కార్యక్రమం...

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులు తమ పంటలను చీడపీడల నుంచి ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పించనున్నారు. ఇందుకు అవసరమైన ద్రవ, ఘన జీవామృతం వంటి సేంద్రియ ఎరువుల తయారీ.. అలాగే బీజామృతం వంటి విత్తన శుద్ధి.. రసాయనం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్ర వంటి కీటక నాశనులు ఎలా తయారు చేసుకోవాలో తెలియజేస్తారు.

ప్రకృతి వ్యవసాయ సాగు వివరాలు

నియోజకవర్గం	ఎంపిక చేసిన రైతులు	సాగులక్ష్యం (ఎకరాల్లో)
బద్వేల్	68	476.34
జమ్మలమడుగు	88	123.09
కడప	50	52.67
కమలాపురం	87	115.16
మైదుకూరు	94	97.17
ప్రొద్దుటూరు	05	6.23
పులివెందుల	109	168.49



విత్తనాల సాగుకు సిద్ధమవుతున్న రైతులు

విత్తన కిట్లు అందించాం



సేంద్రియ సాగు ప్రోత్సాహంలో భాగంగా వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విత్తన కిట్లను అందచేస్తున్నాం. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 828 మంది రైతులను గుర్తించాం. వీటిలో ఇప్పటి వరకు 50 మందికి కిట్లను అందజేశాం. మిగలిన వారికి మరో వారం పదిరోజుల్లో అందజేస్తాం. – రామకృష్ణరాజు, ప్రకృతి వ్యవసాయం డీపీఎం, వైఎస్సార్‌జిల్లా

పీఏసీఎస్‌ల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా మండలస్థాయిలో ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్‌లు) అభివృద్ధికి కృషి చేయాలని అప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం కడపలో డీసీసీ బ్యాంకు అధికారులు, పీఏసీఎస్ డెవలప్‌మెంట్ కమిటీతో చర్చించారు. ప్రతి పీఏసీఎస్ ఆస్తులు ఏంత.. అప్పులెంత అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా పరిధిలో ఎంతమందికి లోన్లు ఇచ్చారు. రికవరీ ఎలా ఉందనే అంశాలపై కూడా చర్చించారు. నష్టాలలో ఉన్న పీఏసీఎస్‌ల గురించి కూడా ఆరా తీశారు. వాటిని లాభాల పట్టించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.సమావేశంలో డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్, బ్యాంకు సలహాదారు సహదేవరెడ్డి, ఓఎస్‌డి గుర్రప్ప, జీఎంలు రాజామణి, సరేంద్రబాబు, డీజీఎంలు ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాలిరెడ్డి, వీరశంకర్, ఏజీఎంలు రాజేంద్రప్రసాద్, వీరబ్రహ్మం, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప డీసీసీ బ్యాంకుకు అవార్డు

కడప అగ్రికల్చర్: కడప నగరపాలక పరిధిలో అన్ని బ్యాంకుల కంటే కడప డీసీసీ బ్యాంకు పీఎం స్వనిధి కింద అధిక రుణాలను అందచేసినందుకు అవార్డును దక్కింది.ఈ అవార్డును మంగళవారం కడపలో నిర్వహించిన పీఎం స్వనిధి అవేర్‌నెస్ అండ్ ఫెలిసిటేషన్ వర్క్‌షాపులో నగరపాలక కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ చేతుల మీదుగా డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ తరపున బ్యాంకు మా రిటైల్ క్రెడిట్ మేనేజర్ కవిత ప్రశంసపత్రం, అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ దుర్గప్రసాద్ తదిరులు పాల్గొన్నారు.

మోడల్‌టౌన్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

కలెక్టర్ విజయరామరాజు



వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు బజార్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్: పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం నూతనంగా నిర్మించిన రైతు బజార్‌లోని కూరగాయల మార్కెట్‌ను ఆయన పరిశీలించారు. రైతు బజార్‌ను సెప్టెంబర్ 1వ తేదీన ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.అనంతరం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అన్ని శాఖల అధికారులతో మోడల్ టౌన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. అనంతరం అంబకపల్లె రోడ్డులో ఉన్న నగరవనానికి సంబంధించి వ్యాపార సముదాయాలపై ఆయన అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాల్లో పటిష్ట చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

కడప కోటిరెడ్డిసర్కిల్: కర్మాగారాల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం కడపలో హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు తదితర కర్మాగారాల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికలతో ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారి బసిరెడ్డి, చెన్నూరు డిప్యూటీ తహసీల్దార్ డీవీ రమణ, సిద్దవటం తహసీల్దార్ లక్ష్మీదేవి, వల్లూరు తహసీల్దార్ శంకర్‌రావు, చెన్నూరు ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డితోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఒంటరి ప్రయాణికులకు భరోసా

రైళ్లలో ప్రయాణిస్తున్న ఒంటరి మహిళలకు రక్షణ కల్పించేందుకు మేరీ సహేలి పేరుతో మహిళా పోలీసులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు ఒంటరిగా వెళుతున్న వారికి భరోసా కల్పిస్తారు. మహిళలకు రక్షణగా ఉంటూ వారు దిగే స్టేషన్ వరకు తాము న్నామనే భరోసా కల్పిస్తారు. ప్రయాణికులను చైతన్యవంతులను చేసి వారికి రక్షణ కల్పించడమే వారి ప్రధాన ఉద్దేశ్యం. ప్రయాణికులకు ఏసమస్య ఉన్నా 139కు కాల్ చేయవచ్చు.

అతివలకు అండగా మేరీ సహేలీ



రైలులో ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలకు సూచనలిస్తున్న మేరీ సహేలి సభ్యురాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: రైలు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు రైల్వేశాఖ చర్యలు చేపడుతోంది. రైలులో సహచర ప్రయాణికులకు ఏమాత్రం ఇబ్బంది కలిగించినా కేసు నమోదు చేసి జైలుకు పంపాలని ఆ శాఖ అధికారులు నిర్ణయించారు. అయితే ఈ పనిని రైల్వే రక్షక దళానికి అప్పగించారు. తోటి ప్రయాణికుల వల్ల ఎదురవుతున్న సమస్యలపై భారతీయ రైల్వే మంత్రిత్వశాఖకు ఇటీవలి కాలంలో అధిక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. వాటి ప్రకారం ఇకనుంచి రైలు ప్రయాణం చేసే సమయంలో ప్రయాణికులు బోగీల్లో ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌లో పాటలు పెట్టి పెద్ద శబ్దాలు చేయడాన్ని పూర్తిగా నిషేధించారు. అలాగే ఫోన్‌లో పెద్దగా మాట్లాడటాన్ని నిషేధించారు. గుంపులు గుంపులుగా ప్రయాణించేవారు రాత్రి 10 గంటల తర్వాత ఇతరులకు ఇబ్బందులు కలిగించే రీతిలో పెద్దగా మాట్లాడకూడదు. రాత్రి 10 గంటల తర్వాత అన్ని బోగీల్లో లైట్లను ఆర్పివేయాలి.

139కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు

రైల్వేశాఖ రూపొందించిన నిబంధనలు పాటించని ప్రయాణికులపై రైల్వే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు. సహచర ప్రయాణికుల వల్ల ఏ చిన్న ఇబ్బంది ఎదురైనా 139 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఇబ్బందికరంగా ప్రవర్తించే వారిపై ఆర్‌పీఎఫ్ సిబ్బంది కేసు నమోదు చేసి వారిని జైలుకు సైతం పంపుతారు. బోగీల్లో ఉండే ఆర్‌పీఎఫ్ సిబ్బంది, టిక్కెట్ కలెక్టర్లు, కోచ్ అటెండెంట్లు, క్యాటరింగ్, ఇతర రైలు సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. ప్రయాణికులు ఇతరుల పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండేలా అప్రమత్తం చేస్తుంటారు. ఎవరికైనా అసౌకర్యం కలిగితే ఆ రైలు సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందని రైల్వేశాఖ స్పష్టం చేస్తోంది.

నిబంధనలు పాటించాలి



రైలులో ప్రయాణిస్తున్న వారికి భద్రత కల్పిస్తాం. అదే సమయంలో వారి ప్రయాణం సాఫీగా జరిగేందుకు తోడ్పాటు అందిస్తాం. ప్రయాణ సమయంలో సహచర ప్రయాణికులు ఇబ్బందులు పడేలా వ్యవహరిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసులు, సీఐ, ఆర్‌పీఎఫ్, కడప

టీడీపీ నేతలు నా మరణాన్ని కోరుకుంటున్నారు

- 2010లో వరద, ఆయన కుమారుడు నాపై హత్యాయత్నం చేశారు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రాజకీయంగా తనను ఓడించే పరిస్థితి లేక టీడీపీ నేతలు తన మరణాన్ని కోరుకుంటున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై దౌర్జన్యం చేసిన మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిపై కేసు నమోదు చేయాలని, వరద చెప్పినట్లు తాను చెబితేనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయా అని అధికారులు విచారించాలని కోరుతూ ఎమ్మెల్యే రాచమల్లు మంగళవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2010లో వరదరాజులరెడ్డి, ఆయన తనయుడు కొండారెడ్డి తనపై పలుమార్లు హత్యాప్రయత్నం చేశారని, ఈశ్వరుడి దయతో ప్రాణాలతో బయటపడ్డానన్నారు. అదే తరహాలో ప్రస్తుతం తనపై కుట్ర జరుగుతోందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఇంటలిజెన్స్ ఐజీ గమనించాలని కోరారు. వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఓవైపు, అభివృద్ధి కార్యక్రమాలు, మానవతా హృదయంతో తాను చేస్తున్న సాయం కారణంగా రాజకీయంగా తనను ఓడించలేమని భావించిన టీడీపీ నేతలు ఏదో విధంగా అడ్డు తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రకృతి సహజంగానైనా, భిన్నంగానైనా తాను ఉండకూడదని వారు కోరుకుంటున్నారన్నారు. తాను ఉన్నంత వరకు నియోజకవర్గంలో వారి ఉనికి కష్టమని తెలుసుకున్నారన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 10,341 రిజిస్ట్రేషన్లు జరిగాయని, వాటిలో ఏ ఒక్క రిజిస్ట్రేషన్‌కు అయినా తనకు సంబంధం ఉందా అని విచారించాలని కోరారు. రోజూ దాదాపు వంద మంది రిజిస్ట్రేషన్‌కు వస్తుంటారని, తాను రెకమెండ్ చేస్తేనే వరద చెప్పినట్లు వారికి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయా అని విచారించాలన్నారు. తనపైనే విచారణ జరిపి వాస్తవాలను అధికారులు వెల్లడించాలని కోరారు. సాధారణ వ్యక్తులకు రిజిస్ట్రేషన్లు జరిగినప్పుడు ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే వరదరాజులరెడ్డికి సంబంధించిన స్థలాన్ని అధికారులు ఎందుకు రిజిస్ట్రేషన్ చేయలేదని ప్రశ్నించారు.

స్థలం రిజిస్ట్రేషన్ చేయలేదనే వరద దాడి

తాను అక్రమంగా కొనుగోలు చేసిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయలేదని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడికి వెళ్లారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. 1972లో బొల్లవరంలో మహర్షి విద్యాలయాన్ని ఏర్పాటు చేశారని, ఈ ఆశ్రమం ఏర్పాటు కోసం అప్పట్లో కందుల నరసింహారెడ్డి 1.71 ఎకరాల స్థలాన్ని దానంగా ఇచ్చారన్నారు. దాత సూచించినట్లు విద్యాలయం, లేదా ఆశ్రమాన్ని నడపాల్సి ఉందన్నారు. సంస్థకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో డైరెక్టర్లు ఉన్నారని తెలిపారు. ఈ భూమి విలువ సుమారు రూ.30 కోట్లు అవుతుందని, అయితే ఇందులో ఒక డైరెక్టర్‌తో మాట్లాడుకుని వరద ఈ స్థలాన్ని అక్రమంగా కొనుగోలు చేయాలని ప్రయత్నించారన్నారు. రూ.2 కోట్లకు బేరం పెట్టగా ముందుగా రూ.30లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతోపాటు కందుల నరసింహారెడ్డి కోడలు, మనువడు కోర్టును ఆశ్రయించి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారన్నారు. తన మాట విని ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయలేదనే కారణంగా వరదరాజులరెడ్డి మహిళా సబ్ రిజిస్ట్రార్‌ను బెదిరించి దాడి చేశారన్నారు. ఏ హక్కుతో కార్యాలయంలో అధికారులకు విధులకు ఆటంకం కలిగిస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. స్థలం కొనుగోలుతో వచ్చే డబ్బును రానున్న ఎన్నికల్లో ఖర్చు పెట్టేందుకు ప్లాన్ రచించారన్నారు. తనపై అక్కసుతో మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నానని ఆక్రోశాన్ని వెళ్లగక్కారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు ఆయిల్‌మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, రాజుపాళెం ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ అంజనీకుమారి, ఆర్‌పీజీఏ మెంబర్ కాకర్ల నాగేశ్వరెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద పాల్గొన్నారు.

అధికారుల హామీతో ధర్నా విరమణ

ధర్నావిషయం తెలుసుకున్న స్టాంప్స్,రిజిస్ట్రేషన్స్ ఐజీ వి.రామకృష్ణ,డీఐజీ శివరాం, జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు వచ్చి చర్చించిన అనంతరం ఎమ్మెల్యే ధర్నా విరమించారు.

ఆలిమ్‌కో క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

రాయచోటి అర్బన్: సామాజికన్యాయ, సాధికారిత మంత్రిత్వశాఖ సౌజన్యంతో కాన్పూర్‌కు చెందిన కృతిమ అవయవముల తయారీసంస్థ (ఆలిమ్‌కో) ద్వారా నిర్వహించనున్న సహాయ పరికరాల గుర్తింపు శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయసంచాలకులు ఆర్.వి.క్రిష్ణకిషోర్ తెలిపారు. ఈ నెల 17న రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 18న రాజంపేట జెడ్పీ హైస్కూల్ ఆవరణలో,19న రైల్వేకోడూరు జెడ్పీ బాలికల ఉన్నతపాఠశాల ఆవరణలో ప్రత్యేక సహాయ పరికరాల గుర్తింపు శిబిరాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర పరిధిలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రిమ్స్ పోలీసులు తెలిపారు. ఆయనకు 60 ఏళ్లు ఉంటాయని, టీబీ వార్డులో చేరిన 24 గంటల్లోనే పరిస్థితి విషమించి మృతి చెందాడని వివరించారు. మృతుని సంబంధీకులు రిమ్స్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని వారు తెలియజేశారు.

రైలు కింద పడి..

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో కడప వైపు వెళ్లే రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి షేక్ అబ్దుల్ నబీ (21) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు మంగళవారం తెలిపారు. ప్రొద్దుటూరు మండల పరిధిలోని అమృతనగర్ కాలనీలో నివాసం ఉండే ముంతాజ్ కుమారుడు అబ్దుల్ నబీ. ఇతను ఇంటర్‌కు చదువుకున్నాడు. మంగళవారం తెల్లవారుజామున గూడ్స్ రైలు కింద పడి మృతి చెందాడు.

డ్రైనేజీలో పడి..

మైదుకూరు : డ్రైనేజీలో పడి మైదుకూరుకు చెందిన రత్నరాజు (48) అనే వ్యక్తి మంగళవారం ఉదయం మృతి చెందాడు. పట్టణంలోని సీఎస్ఐ చర్చి ప్రాంతంలో నివాసం ఉంటున్న రత్నరాజు స్థానిక కేసీ కెనాల్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో కళ్లు తిరుగుతున్నాయని మోరీపై కూర్చొని ఉన్నఫళంగా డ్రైనేజీలో పడినట్టు స్థానికులు చెబుతున్నారు. గుండెపోటు వల్లే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

చికిత్స పొందుతూ..

ముద్దనూరు : పెనికలపాడు గ్రామానికి చెందిన గుర్రప్ప అనే వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. జూలై 19న గుర్రప్ప ముద్దనూరు నుంచి స్కూటర్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. తిమ్మాపురం గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న గుర్రప్ప మంగళవారం కడప రిమ్స్‌లో మృతి చెందాడు.

అందుబాటులోకి మనోవిజ్ఞాన సేవలు

- వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్
- సైకలాజికల్ క్లినిక్ సేవలు ప్రారంభం



సైకలాజికల్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం మనోవిజ్ఞానశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రజలకు సైకలాజికల్ క్లినిక్ సెంటర్ ద్వారా సేవలందించనున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వైవీయూ సైకాలజీ శాఖ ఆధ్వర్యంలో 'సైకలాజికల్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని' రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సామాజికసేవలో భాగంగా విశ్వవిద్యాలయం జిల్లా ప్రజలకు తమవంతు సేవలందిస్తుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఆచార్యుల పరిశోధన ఫలితాలు ప్రజలందరికీ చేరువ కావాలన్న ఉద్దేశంతో బ్రౌన్ కేంద్రంలో ప్రజలందరికీ అందుబాటులో సైకలాజికల్ క్లినిక్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉన్నతవిద్యను మరింత అందుబాటులోకి తెచ్చేందుకు డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బోధన, పరిశోధన, విస్తరణ అన్న మూడు లక్ష్యాలతో విశ్వవిద్యాలయం ముందుకు సాగుతోందన్నారు. మనోవిజ్ఞానశాస్త్ర శాఖ అధ్యాపకులు డాక్టర్ కె.లలిత, డాక్టర్ వి.లాజరస్ మాట్లాడుతూ మానసిక సమస్యలపై వచ్చే వారికి కౌన్సెలింగ్ నిర్వహించి సాంత్వన చేకూర్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం సైకలాజికల్ క్లినిక్ ద్వారా లభించే సేవలకు సంబంధించిన పోస్టర్‌ను వీసీ, రిజిస్ట్రార్, అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీమలో ఏకైక డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కేంద్రంగా వైవీయూ

రాయలసీమ నుంచి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అందిస్తున్న ఏకైక విశ్వవిద్యాలయంగా యోగివేమన విశ్వవిద్యాలయం ప్రత్యేకత సాధించిందని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో విశ్వవిద్యాలయంలో దూరవిద్యను ప్రారంభించేందుకు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) అనుమతులు లభించడంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రవేశాల ప్రక్రియ కోసం ఇప్పటికే వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో లెర్నర్ సపోర్ట్ సెంటర్‌లను, ప్రత్యేక కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఉన్నతవిద్యలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేందుకు దూరవిద్య దోహదం చేస్తుందన్నారు. దూరవిద్యతోపాటు ఆన్‌లైన్ విద్య అందించనున్నట్లు తెలిపారు. వైవీయూ దూరవిద్యాకేంద్రం సంచాలకులు ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల పీజీ కోర్సుల నిర్వహణ సెమిస్టర్ విధానంలో ఉంటుందన్నారు. అనంతరం దూరవిద్యాకేంద్రం అందించే కోర్సులు, పని చేసే విధానాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, దూరవిద్యా కేంద్రం ఉప సంచాలకులు డాక్టర్ ఆర్.శ్రీధర్‌బాబు, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి, పీఆర్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద యువకుడి మృతి



గణేష్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న జాలర్లు

వల్లూరు : ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద నీటిలో మునిగి కడప నగరం చిన్నచౌక్ పరిధిలోని నెహ్రూ నగర్‌కు చెందిన నల్లబల్లె గణేష్ (17) మృతి చెందినట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఎలక్ట్రీషియన్ పని చేసి జీవనం సాగించే గణేష్ తనతోపాటు పని చేసే స్నేహితులు శివ మణి, వెంకటేష్‌లతో కలిసి సోమవారం సాయంత్రం సరదాగా గడపడానికి ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్దకు వచ్చారు. శివమణి, గణేష్ ఈత ఆడడానికి పెన్నా నది నీటిలో దిగారు. కొద్ది సేపటికి శివమణి బయటికి రాగా నీటిలో గడుతువున్న గణేష్ గల్లంతయ్యాడు. కాగా మంగళవారం ఉదయం పోలీసులు జాలర్ల సహాయంతో ఆనకట్ట వద్ద నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో గణేష్ మృతదేహం బయట పడింది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు.

నాసిరకం మొక్కలతో నష్టపోయిన రైతులు



నాసిరకం అరటి చెట్ల వద్ద బాధిత రైతులు

వేంపల్లె : జిల్లా వ్యాప్తంగా కేఎఫ్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నాసిరకం అరటి మొక్కలను విక్రయించి మోసం చేసిందని, ఆ కంపెనీ మీద చర్యలు తీసుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం బాధిత రైతులు మీడియాతో మాట్లాడారు. 2022 జూన్‌లో వైఎస్సార్ జిల్లాలో చాలా మంది రైతులు ఈ మొక్కలు కొనుగోలు చేసి అరటి పంటను సాగు చేశారని తెలిపారు. అవి ఆరు నెలల మొక్కల తర్వాత నాసిరకపు మొక్కలను డీసీ చెట్లు అని పులివెందులకు చెందిన హార్టికల్చర్ యూనివర్సిటీ ఉన్నతాధికారులు తేల్చేసి రిపోర్ట్ కూడా ఇచ్చారని తెలిపారు. కంపెనీ మీద వినియోగదారుల ఫోరంను జిల్లా కోర్టులో కేసు వేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా పులివెందుల నియోకవర్గంలో 2 లక్షల నాసిరకం మొక్కలు ఇవ్వడం జరిగిందన్నారు. అందులో వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లెలో చాలా మంది రైతులు కొనుగోలు చేశారన్నారు. రైతులకు న్యాయం చేస్తామని కంపెనీ హామీ ఇవ్వడం జరిగిందని, అయితే ఇప్పటి వరకు ఏ రైతుకు నష్టపరిహారం కానీ, న్యాయం కానీ చేయకపోవడమే కాక పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ఈ ఏడాది అరటి రేటు టన్ను రూ.30 వేల వరకు రికార్డు స్థాయిలో పలికిందని.. ఈ నాసిరకం మొక్కల వలన రైతులు చాలా నష్టపోయారని తెలిపారు. కావున వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఆ కంపెనీ లైసెన్స్‌లు రద్దు చేసి, మన రాష్ట్రంలో ఆ కంపెనీ మొక్కలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్ జిల్లాలోనే కాక సత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లాలోని రాయలచెరువు, ముదిగుబ్బ మండలాల్లో ఈ కంపెనీ మొక్కలను కొనుగోలు చేసి దిగుబడ రాక లబోదిబోమంటున్నారని వివరించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యబృందం

రాయచోటి టౌన్ : ప్రతి పేద వాడికి మెరుగైన వైద్యం అందించాలన్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కలల సాకారంలో భాగంగా రాయచోటిలో అరుదైన శస్త్రచికిత్స జరిగింది. రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవరం ఉదయం సంబేపల్లె మండలం దుద్యాల గ్రామానికి చెందిన ఓ మహిళ రెక్టో వెజైనల్ ఫిస్తులా (మలం యోని ద్వారా బయటికి రావడం) వ్యాధితో బాధపడుతోంది. అసలే పేద కుకుటుంబం కావడంతో ఖరీదైన శస్త్ర చికిత్స చేయించుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండేది. ఈ సందర్భంలో ఆమె మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలోని డాక్టర్ జీనత్ బేగంను కలసి వైద్యం పొందింది. దీంతో ఆమె సహచర డాక్టర్లతో సంప్రదించి ఇక్కడే ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేసింది. వెంటనే సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ ఏర్పాట్లు చేసి ఆమెకు ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ రాయచోటిలో 50 పడకల ఆస్పత్రి ఉన్న స్థితి నుంచి 100 పడకల ఆస్పత్రి వరకు పెంచడంతోపాటు అందుకు కావాల్సిన భవన నిర్మాణాలు కూడా వేగంగా సాగుతున్నాయని చెప్పారు. దీంతో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. అలాగే 150 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా ప్రతిపాదనలు పంపారని తెలిపారు. ఇప్పటికే కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రతి పేదవాడికి వైద్యసేవలు అందుతున్నాయని, భవిష్యత్తులో 150 పడకల ఆస్పత్రిగా మారితే మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో డాక్టర్లు వెంకటశివ, డాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలపై వీడిన ఉత్కంఠ

- 19న జిల్లా కోర్టులో కౌంటింగ్
- ఫలితాలు సీల్డ్ కవర్‌లో అందజేయాలని హైకోర్టు ఆదేశం

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలపై హైకోర్టు తీర్పును మంగళవారం వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. బార్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న న్యాయవాదులు కలలు ఫలించాయి. రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాలపై మంగళవారం హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేస్తూ తన తీర్పును వెలువరించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. భారత దేశ చరిత్రలో ఏ అడ్వకేట్ బార్ అసోసియేషన్‌లో ఇంత వరకు బతికున్న న్యాయవాదులను ఓటర్ లిస్టు నుంచి తొలగించడం ఎక్కడా జరగలేదని విస్తుపోయింది. వివిధ కారణాలు చూపి ఎన్ని సార్లు వాయిదాలు తీసుకుంటారని గౌరవ హైకోర్టు గట్టిగా మందలించింది. ఈనెల 19వ తేదీన కడప జిల్లా కోర్టులో అన్ని ఓట్లు కౌంటింగ్ చేసి (తొలగించిన ఓట్లతో కలిపి), గౌరవ హైకోర్టు వారికి 24వ తేదీ లోపు సీల్డ్ కవర్‌లో భద్రపరచి ఎన్నికల ఫలితాన్ని అందజేయాలని ఎన్నికల అధికారిని ఆదేశించడం జరిగింది. దీంతో ఎన్నికల ఫలితాల ఉత్కంఠకు హైకోర్టు తెరదింపింది. రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి హైకోర్టులో జరిగిన విషయాలను న్యాయవాది కె.ఎం.ఎల్. నరసింహులు తెలిపారు.

పూర్తి గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, నిర్వాసితులు

కొండాపురం : గండికోట జలాశయం కింద కె.సుగుమంచిపల్లె గ్రామం మొత్తాన్ని ముంపు పరిధిలోకి తీసుకోవాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం నిర్వాసితులతో కలిసి కలెక్టర్ విజయరామరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. కె.సగుమంచిపల్లెలో మొత్తం 250 ఇళ్లు ఉన్నాయని, వాటిలో 134 ఇళ్లను ముంపులోకి తీసుకున్నారని, మిగతా 116 ఇళ్లను కూడా తీసుకోవాలన్నారు. కె.సుగుమంచిపల్లె గ్రామానికి శ్మశాన వాటిక లేదన్నారు. పునరావాస సమస్యలను కలెక్టర్‌తో చర్చించారు. అలాగే గ్రామానికి దత్తాపురం, బుక్కపట్నం, బొమ్మేపల్లె గ్రామాలను చేర్చకుండా కె.సుగుమంచిపల్లె పంచాయతీని వేరు చేయాలని గ్రామస్తులు కోరారు. ఆగస్టు 15 తర్వాత గ్రామాన్ని పరిశీలించేందుకు ఆర్డీఓను పంపిస్తామని, ఈ సమస్యపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, శ్రీరంగనాథరెడ్డి, నాగుఅమర్‌నాథ్‌రెడ్డి, ఎస్.ఆదినారాయణరెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ANDHRA PRADESH STATE WAQF BOARD
4th Floor, Imdad Ghar, Opp. Head Post Office, Kaleswararao Market, Vijayawada-1.
F.No. 01/M/KDP/2018/Z-IV-2, Date: 24.07.2023

NOTIFICATION

The Waqf institution namely Masjid Sunni (Bande Hussain Khan Masjid), Palempepayya street, situated at 7-Roads Circle, Kadapa City, YSR Kadapa District is a notified Waqf and got published in AP Gazette No. 13, Part-11, Dated:26-03-1964 under serial No 38 at page Nos.276 & 277 under the Towliath of Abdul Razack Saheb. The rule of sucession to the office of the Mutawalli specified as " By Common Concent".

A proposal has been submitted by Inspector Auditor Waqfs, YSR Kadapa District along with representation of Sri Shaik Abdul Haq, S/o. Shaik Mohammed Iliyas, R/o.7/3642, Srinivasa Nagar, Proddatur Town, YSR Kadapa District and recommended to consider the request of the applicant and appoint him as Mutawalli to the subject institution.

Therefore any person having claims / objections if any, may file before this office along with documentary evidence for appointment of Sri Shaik Abdul Haq, S/o. Shaik Mohammed Iliyas R/o 7/3642, Srinivasa Nagar, Proddatur Town, YSR Kadapa District as Mutawalli of the subject Waqf institution and its attached properties U/sec.63 of Waqf Act, 1995 within a period of (15) days from the date of publication of this notification, otherwise the matter will be decided on merits on the basis of the documents available on record.

CHIEF EXECUTIVE OFFICER, Andhra Pradesh State Waqf Board, Vijayawada.

నేడు రెండో విడత నాడు-నేడుపై సమీక్ష

రాయచోటి : రెండో విడత నాడు-నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం తెలిపారు. మంగళవారం రాయచోటిలో పత్రికలకు అందజేసిన ప్రకటనలో డీఈఓ తెలియపరిచారు. బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పీలేరు పట్టణంలోని చిత్తూరు రోడ్డులో ఉన్న భువన విద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పీలేరు, కలికిరి, కలకడ, వాయల్పాడు, కెవి పల్లె, గుర్రంకొండ మండలాల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరు కావాలన్నారు. అలాగే మధ్యాహ్నం రాయచోటి పట్టణం, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎదురుగా ఉన్న ఫయాజ్ ఫంక్షన్ హాల్‌లో ఉంటుందన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి



మృతి చెందిన పొడదుప్పి

అట్లూరు : అడవి నుంచి వచ్చిన దుప్పి కుక్కల బారిన పడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వలసపాళెం గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. మంగళవారం గ్రామ శివారున కుక్కలు పొడదుప్పిని వెంబడించడం గుర్తించి గ్రామస్తులు కుక్కలను తరిమారు. పొడదుప్పిని వారి వద్ద ఉంచుకుని సిద్దవటం రేంజ్ అధికారి కళావతికి సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆమె వెంటనే సెక్షన్ అధికారి సురేష్‌కు ఆదేశాలు ఇవ్వడంతో ఆయన సిబ్బందితోపాటు పశువైద్యాధికారిని తీసుకుని వచ్చారు. అప్పటికే దుప్పి మృతి చెందినట్లు పశువైద్యాధికారి తెలిపారు. దుప్పి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సమీప అటవీ ప్రాంతంలో ఖననం చేశారు.

అనుమానాస్పద స్థితిలో..

కేవీపల్లె : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని నూతనకాల్వ పంచాయతీ దిన్నెవడ్డిపల్లెలో చోటు చేసుకుంది. ఎస్ఐ లోకేష్ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. చిన్నమండ్యెం మండలం సాకిబండకు చెందిన మల్లీశ్వరి (36) మల్లికార్జునతో వివాహం జరిగి, వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే భర్తతో విడిపోయి ఏడేళ్లుగా దిన్నెవడ్డిపల్లెకు చెందిన యల్లయ్యతో సహజీవనం చేస్తోంది. సోమవారం రాత్రి యల్లయ్య, మల్లీశ్వరి గొడవ పడ్డారు. ఏమి జరిగిందో తెలియదు కానీ మంగళవారం ఉదయం మల్లీశ్వరి మృతి చెంది ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


విద్యార్థిని అదృశ్యం

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం పొన్నూటిపాలెంకు చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని(16) కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో అమ్మాయి తల్లి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. విద్యార్థిని సోమవారం కాలేజీకి వెళ్లి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. కన్పించకపోవడంతో రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లెకు చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యం అయినట్లు ఎస్ఐ ఎస్ఎండీ షరీఫ్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. కట్టుగుత్తపల్లెకు చెందిన బాలిక సోమవారం ఉదయం రాయచోటిలో సర్టిఫికెట్లు తెచ్చుకొంటానని వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పౌరసరఫరాల గిడ్డంగి తనిఖీ



తూనికల పరికరాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్ రవీందర్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ గిడ్డంగిని కొలతలు, తూనికల శాఖ కడప అసిస్టెంట్ కంట్రోలర్ రవీందర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తూనికల పరికరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తూకాలు సరిగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. ప్రతి ఒక చౌక దుకాణానికి వందశాతం తూకాలు వేసి బియ్యం సరఫరా చేయాలని గోడౌన్ ఇన్‌చార్జికి సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గోడౌన్ ఇన్‌చార్జి మల్లికార్జున, బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు షాపులో చోరీ

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని రోషన్ మజ్జీద్ సమీపాన గల యస్‌యూ కాస్టింగ్ మౌలింగ్ బంగారు షాపులో చోరీ జరిగినట్లు ఆ షాపు యజమాని ఖలీలుల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి షాపు మూసి వేసి ఇంటికి వెళ్లి.. తిరిగి మంగళవారం రాగా డోర్లు తెరిచి ఉండటం చూసి షాక్‌కు గురైనట్లు తెలిపారు. లోపలికి వెళ్లి చూడగా 200 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు దోచుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్ వివేకాకు నివాళి



కేక్ కట్ చేస్తున్న వైఎస్ సునీత, కుటుంబ సభ్యులు

పులివెందుల : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి 72వ జయంతి సందర్భంగా పులివెందులలో ఆయన సమాధి వద్ద కుమార్తె వైఎస్ సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, కుటుంబ సభ్యులు నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వైఎస్ వివేకా పార్కులో కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వైఎస్ సునీత మీడియాతో మాట్లాడుతూ వైఎస్ వివేకా తాను ఇంటర్ చదువుతున్న సమయంలో తనతో ఒక మాట అన్నారని.. మనల్ని పొగిడేవాళ్ల గురించి పట్టించుకోకూడదని.. ఎవరైతే తప్పులు చెప్తారో వాటిని గ్రహించి లోపాలను సరిచూసుకోవాలని చెప్పేవారన్నారు. ఈ రోజు నాన్న గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నామని.. ఎక్కువగా గుర్తొస్తున్నారన్నారు. సీబీఐ విచారణ విషయంలో వాళ్ల పని వాళ్లు చేస్తున్నారని.. మన జోక్యం అవసరం లేదన్నారు.

రాగి వైరు దొంగల అరెస్ట్



పట్టుకున్న సొత్తు, నిందితులతో సీఐ, ఎస్ఐ

రాజంపేట రూరల్ : వివిధ మండలాలలో రాగి వైర్లు దొంగలించిన ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4 లక్షల విలువ చేసే ఒక మోటార్, రాగి వైర్లు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ కే పుల్లయ్య తెలియజేశారు. స్థానిక మన్నూరు పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎస్ఐ ఎం.భక్తవత్సలంతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని హేమాద్రివారిపల్లికి చెందిన బాలరాజు రామయ్య, నగిలి పెంచలయ్య అలియాస్ మగధీర, తాళ్లపాక రాజశేఖర్, తాళ్లపాక విజయకుమార్, తాళ్లపాక ప్రవీణ్, పెరూరి లక్ష్మీనరసయ్య కరెంటు ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి అందులో ఉన్న రాగి వైర్లను దొంగలించేవారు. వాటిని విక్రయించి వచ్చిన నగదుతో జల్సాలు చేసుకునేవారు. ఇలాంటి వాటికి సంబంధించి మన్నూరు పీఎస్‌లో 3, చిట్వేలి లో 3, రైల్వేకోడూరులో 2, పుల్లంపేట పీఎస్‌లో 1 కేసు నమోదయ్యాయి. వారు విక్రయించగా మిగిలిన రూ.1.50 లక్షల విలువ చేసే 103 కేజీల రాగి వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ సొత్తును కొనుగోలు చేసిన కె బోయినపల్లికి చెందిన గుజిరి వ్యాపారి సింగమనేని చిట్టిని అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి రూ.2.50 లక్షల విలువ చేసే మోటారు పంపు సెట్టును స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుల్‌లు పోలి నందకుమార్‌రెడ్డి, సీ లక్ష్మీదేవి, ఎంవీ రమణ, సురేష్‌బాబు, పీసీలు పీ రమణ, యు సుదర్శనరాజు, హేమలత తదితరులు ఉన్నారు.

పీఎం స్వనిధి రుణాలు సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం వెంకటేశ్వరరెడ్డి

రాయచోటి అర్బన్ : వీధి విక్రయదారులు పీఎం స్వనిధి కింద మంజూరయ్యే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ (ఎల్‌డీఎం) వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఎల్‌డీఎం అధ్యక్షతన పీఎం స్వనిధి నిధుల వినియోగంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి విక్రయదారులంతా దాదాపుగా వీలైనంత మేర నగదు రహిత లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మెప్మా పీడీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం స్వనిధులను ప్రతి వీధివిక్రయదారుడు పెట్టుబడిగా ఉపయోగించుకుని ప్రణాళికాబద్ధంగా వ్యాపారాలను నిర్వహించుకోవాలంటూ సూచించారు. నిధుల సద్వినియోగం ద్వారా వ్యాపారాభివృద్ధితోపాటు ఆర్థికాభివృద్ధిని సాధించాలంటూ సూచించారు. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ విక్రయదారులంతా లోనుకు కేటాయించిన జోన్‌లలో వ్యాపారాలను నిర్వహించుకోవాలన్నారు. అనంతరం సీఎం స్వనిధి నిధులను తీసుకుని క్రమం తప్పకుండా బ్యాంకులకు వాయిదాపద్ధతిలో రుణాలను తిరిగి చెల్లించి తిరిగి తీసుకున్న వీధివిక్రయదారులను, అందుకు సహకరించిన మెప్మా అధికారులు, ఉన్నతాధికారులను సన్మానించారు. కార్యక్రమంలో మెప్మా రాయచోటి సియంయం అబ్బాస్‌అలీఖాన్, టీఈలు నాగరాజు, నారాయణరెడ్డి, మెప్మా సిఓలు రామయ్య, కళ్యాణ్‌బాబు, రమణమ్మ, ఆర్‌పిలతోపాటు వివిధ శాఖల బ్యాంకు అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.